# శఠగోపం

-అంగజాల లక్ష్మణరావు

"ఓర్నాయనో! నా కొంప కొల్లేరయిపోయింది దేవుడోయ్'' ఆండాళ్ళు అరుపులు ఆరున్నొక్కరాగంలో విన్పిస్తున్నాయి హాల్లోంచి. వంటచేస్తున్న వర్రావు తుళ్ళిపడి, పడుతూలేస్తూ పరుగులంకించుకున్నాడు హాల్లోకి "ఏమైందే?'' అంటూ.

"ఏమైందా..? అని మెల్లగా అడుగుతున్నావా? నన్నూ నా బిడ్డనీ నిలువునా ముంచేశావు కదయ్యా. ఆ దిక్కుమాలిన గబ్బిలాల దేష్టబ్యాంకులో డబ్బులెయ్యొద్దంటే ఇన్నావా..? నీమాట నీదే. అయినా ఆడదాని మాట పట్టించుకోని మగాడెవడు బాగుపడ్డాడయ్యా'

"గబ్బిలాలా..? పైగా దేష్టబ్యాంకా? అదెక్కడుందే?'' బుర్రగోక్కున్నాడు వరాల్రావు.

"ఏంటీ? అదెక్కడుందో కూడా తెలీదా? తెలీకుండానే డబ్బులేశావా? అలా నోరెళ్ళబెడతావేంటి? టీవీలో వార్తలు చూడు. నువ్వు డబ్బులేసిన బ్యాంకు దివాలా తీసిందట. లబోదిబోమంటూ లగెత్తుకెల్తన్నారు జనం. నువ్వూ తగలడు ఆ కాగితాలట్టుకుని''

"అలాగేలేవే. అసలేం జరిగిందో చూడనీ ముందు'' టీవీ కేసి దృష్టిసారించాడు వరాల్రావు.

"ఓహో! గ్లోబల్‌ట్రస్ట్ బ్యాంకుకొచ్చిన తిప్పలా ఇవి..'' అనబోతూ నోరిప్పితే ఇంకా ఏం వినాల్సొస్తుందోనని బుద్ధిగా బట్టలేసుకుని బయటకెళ్ళబోతుంటే-

"అమ్మగారూ ఇదెక్కడ పారబొయ్యమంటారు?'' అంటూ చీపురుకట్ట చింకిచేటతో కొత్తగా పనిలోకి చేరిన కొండమ్మ తయారు వీధి గుమ్మంలో.

"నీ సిగతరగ. నువ్వూ ఇప్పుడే తగలడాలా? ఆ చెత్తకాస్త నా నెత్తిమీద గుమ్మరించు. అయిపోయింది దేముడో. ఇన్నాళ్ళూ దాచుకున్న డబ్బులన్నీ గంగలో కలిసిపోయినట్టే'' ఉస్సూరుమంటూ వరండాలో కూలబడింది ఆండాళ్ళు.

బయటికెళ్లాలో లోపలికెళ్లాలో తెలీక వరాల్రావూ, ఏంచెయ్యాలో పాలుపోక కొండమ్మా ముఖాముఖాలు చూసుకున్నారు. చూసుకోవడంతో సరిపెడితే గొడవే లేకపోను.

"ఇప్పుడేం చెయ్యాలో చెప్పండమ్మా..?'' అన్నట్టు వయసులో ఉన్న కొండమ్మ అయ్యగారి కళ్లల్లోకి సూటిగా చూడడమూ 'కాసేపయ్యాక అదే సర్దుకుంటుందిలే. నువ్వు మెల్లగా బయటికి జారుకో' అని గురుడు కళ్లతో సైగ చెయ్యడమూ ఆండాళ్ళు దృష్టిలో పడ్డాయి. అంతే. అసలే కోపంలో ఉందేమో. అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది ఆండాళ్ళు. బయటికెళ్ళబోతున్న కొండమ్మ జుట్టు పట్టుకుంది.

"ఏంటే...వగలు పోతున్నావ్? నాకొంపకే ఎసరెట్టాలని చూస్తున్నావా? తాట ఒలిచేస్తాను జాగ్రత్త. ఆ చీపురుకట్టిలా తేవయ్యా'' అని ఒంగుందో లేదో "హమ్మయ్య...బ్రతికేన్రా భగవంతుడా'' అనుకుంటూ పట్టు విడిపించుకుని పరుగులంకించుకుంది కొండమ్మ.

జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టి నాలుగే నాలుగు అంగల్లో ఇంట్లోకి అటునుంచటే పెరట్లోకి జంప్‌చేసి దొడ్డిదారిన వీధిలో పడ్డాడు వర్రావు.

బ్యాంక్‌చుట్టూ వందల్లో వేలల్లో జనం. లోపలికి జొరబడ్డానికి ట్రై చేస్తున్న జాన్ని అదుపుచెయ్యలేక అవస్థ పడుతున్న పోలీసులు. అంతా గందరగోళంగా ఉంది. అంటే ఆండాళ్ళు చెప్పింది నిజమేనన్నమాట. గుండె గుభేల్‌మంది వరాల్రావుకి. ఒకటా...రెండా? లక్ష. అక్షరాలా లక్షరూపాయలు. అయిదేళ్ళుగా పైసాపైసా కూడబెట్టి అమ్మాయి చదువుకోసం డిపాజిట్ చేశాడు బ్యాంకులో.

అదీ అతికష్టం మీదే ఆండాళ్ళునొప్పించి. అసలొస్తుందో రాదో? ఏం చెయ్యాలో తోచక పిచ్చిగా జుట్టు పీక్కోసాగాడు వరాల్రావు.

"సార్! టోపీలు సార్! కుచ్చుటోపీలు. నెత్తిమీద బొచ్చులేనోళ్లకి ఎండా వానలనుంచి భలే రక్షణ సార్. తీసుకోండి సార్. కారుచౌక. ఒక్కోటీ ఇరవై మాత్రమే'' అరుచుకుంటూ వస్తున్నాడో కుర్రాడు. ఒళ్ళు మండింది వరాల్రావుకి. "ఏం..బేంకోళ్ళు పెట్టిన టోపీ చాల్లేదా నువ్వూ ఇక్కడ తగలడ్డావ్. ఫో! బయటికి'' కసురుకున్నాడు.

"సార్! తమరూ బాధితులేనా? ఏ మాత్రం పోయిందేమిటి?'' కూల్‌గా అడిగాడో ప్రబుద్ధుడు.

"ఎంతపోతే నీకెందుకయ్యా? నువ్వేమైనా ఇస్తావా? అసలే సొమ్ముపోయి నేనేడుస్తుంటే లేనిపోని ఆరాలొకటి'' విసుక్కున్నాడు వరాల్రావు.

"నేనెందుకిస్తానయ్యా. లక్షవరకూ డిపాజిట్ చేసిన కష్టమర్ల సొమ్ముకి ఢోకా లేదని మైక్‌లో అరుస్తుంటే మీకేమైనా ఉపయోగపడుతుందేమోనని అడిగాను. మంచికెళ్తే చెడంటే ఇదే. నువ్వే గంగలో కలిస్తే నాదేం పోయింది'' మెత్తగా చీవాట్లేశాడా పెద్దమనిషి.

అవి తిట్లుకావు. వరాల్రావు పాలిట వరాలు. థౌజండ్ వాట్స్ బల్బులా వెలిగిపోయిందతని మొహం "సారీ సర్. ఐయామ్ రియల్సీ సారీ. థ్యాంక్యూ వెరీమచ్'' అంటూ మైక్ వైపు దృష్టిసారించాడు.

అబ్బే. ఆ గందరగోళంలో వినపడి ఛస్తేగా. 'అదేదో విని తీరాల్సిందే' అని గట్టిగా నిశ్చయించుకుని షర్టు చినిగిపోతున్నా ప్యాంటు జారిపోతున్నా మోచేతులు కొట్టుకుపోతున్నా లెక్కచెయ్యకుండా జనాలమధ్య నుంచి దూసుకెళ్లాడు వరండాలోకి.

★ ★ ★

"అమ్మా! ముష్టాడెవడో గేటు తీసుకుని లోపలికి దూసుకొచ్చేస్తున్నాడే'' భయంగా కేకేసింది గజాలు ది గ్రేట్ ఆండాళ్ళూ వర్రావుల ఏకైక పుత్రికారత్నం.

"దిక్కుమాలిన సంత. ఈ అడుక్కుతినే వెధవలకి వేళాపాళా లేదు. మిట్టమధ్యాహ్నం పూటేమిటి? ముష్టిగోల. వస్తున్నానుండు'' అలవాటు ప్రకారం చీపురుకట్టతో బైటికొచ్చింది ఆండాళ్ళు.

"అబ్బ! నేనేలేవే. ఊరికే గొంతు చించుకుంటావెందుకు?''

"అయ్యో..నువ్వా? ఈవాలకం ఏంటయ్యా? ఎవడితోనన్నా గొడవపడ్డావా? ఆడెవడో చెప్పు. బుర్ర రామకీర్తన పాడించేస్తాను. అయినా నిక్షేపం లాంటి డ్రస్సు''

"అబ్బ.. పోతేపోయింది లేవే బోడి డ్రస్సు. మన డబ్బులకేం ఢోకాలేదు. కట్టింది లక్షే కాబట్టి ప్రతి సోమవారం పదేసివేల చొప్పున తీసుకో వచ్చు. అంటే పదివారాల్లో మన సొమ్ము మొత్తం వచ్చేస్తుంది"

"హమ్మయ్య రక్షించేవు. ఇదుగోనయ్యా! ఇప్పుడే చెబుతున్నా. బ్యాంకులూ రెట్టింపులూ అంటూ ఇక వాటి జోలికెళ్లమాక. మా అన్నయ్య నాకివ్వాల్సిన లక్ష కూడా ఈ నెలలోనే ఇచ్చేస్తానన్నాడు. నేనే స్వయంగా వెళ్ళి ముక్కుపిండి వసూలు చేసి తీసుకొస్తా. శుభ్రంగా ఆ రెండుల క్షలూ మా సుబ్బాయమ్మ ద్వారా నెలవారీ వడ్డీలకి తిప్పుకున్నామంటే అంతకి పదింత లొస్తుంది"

"ఆఁ.. ఎందుకు రాదు? అసలు కాస్త హరీ మంటుంది" గొణుక్కుంటూ బాత్‌రూమ్‌లో దూరాడు వరాౖలావు గట్టిగా మాట్లాడే ధైర్యంలేక.

★ ★ ★

"అక్కయ్యా! సక్సెస్. గ్రాండ్ సక్సెస్. అంతా నీ దీవెన ఫలితం" ఒంగి ఆండాళ్లకు కాళ్లకి నమస్కరిం చేడు అప్పలకొండ.

ఆండాళ్ళు వేలు విడిచిన మేన మామకి బామ్మర్ది కొడుకట. ఎప్పటిక ప్పుడు వస్తుంటాడు అక్కయ్యా! అంటూ. మంచి మాటకారి. జల్సారాయుడు. ఏవో ఆస్తులున్నాయంటాడు సిటీలో.

"అదేంట్రా? ఇన్నాళ్ళూ ఏమైపోయావ్? ఏమిటీ హడావిడి?" మురిసిపోతూ అడిగింది ఆండాళ్ళు.

"చెప్తాను. ముందు స్వీట్స్ తినండి. తినేశాక ఈ పేపర్స్ చూడండి బావగారూ!" అని అయిదుని ముషాలాగి"సిటీకి దూరంగా సింగన్నపాలెం దగ్గర నాకో పదిహేను ఎకరాల స్థలం ఉందని చెప్పానా? ఈమధ్య కొలువుతీరిన కొత్త ప్రభుత్వం ప్రైవేట్ సెక్టార్‌లో ఎడాపెడా ఇంజనీరింగ్ కాలేజీలు శాంక్షన్ చేస్తున్నారని తెలిసి ఆ స్థలంలో ఇంజనీ రింగ్ కాలేజీ కట్టడానికి అవసరమైన ప్లాన్‌లు, ఎస్టి మేట్లు వగైరా తయారుచేయించి హైదరాబాద్‌లో తిష్ట వేశానో నెలరోజులపాటు ఎక్కడివ్వాల్సిన అమ్యామ్యాలు అక్కడ ఇచ్చేసి ఆఘమేఘాల మీద పని జరిపించుకొచ్చేశాను. ఇక చూస్కో. డబ్బే డబ్బు. లక్ష్మీదేవి తిష్టేసినట్టే మన నట్టింట్లో"

"ఎలా?" ముఖాముఖాలు చూసుకున్నారు భార్యాభర్తలు.




"అర్థంకాలేదు కదూ! బిజినెస్ అక్కయ్యా! పక్కా వ్యాపారం. ఓ పదిహేను మంది ఉత్సాహవంతుల్ని కూడగట్టి తలా ఒక లక్షచొప్పున పదిహేనులక్షలు పెట్టుబడి పెట్టిస్తాం. అంతకి అంత. అంటే మరో పదిహేను లక్షలు ప్రభుత్వం వారిస్తారు గ్రాంట్‌గా. ఆ డబ్బుతో బిల్డింగ్ వగైరాలు స్టార్ట్‌చేశాక అవసరానికి ఎన్నిలక్షలైనా పోటీపడి మరీ ఇస్తాయి బ్యాంకులు. ఇంకేముంది? ఓ మంచి రోజు చూసుకుని ఏ మంత్రిగారి చేతో కాలేజీ ఓపెన్ చేయించేస్తాం.

ఇకపోతే ఎంసెట్‌లో అందరికీ ర్యాంకులురావు కదా! రెండొంతులమంది గింజుకుంటారు సీట్లకోసం. అలా నిరాశా నిస్పృహలతో కొట్టుకుంటున్న స్టూడెంట్స్‌నీ, తమ పిల్లల్నీ ఎలాగైనా ఇంజనీర్లుగా చూడాలనే తల్లిదండ్రుల బలహీనతల్ని మనం ఎన్‌క్యాష్ చేసుకుంటాం. డిమాండ్‌ని బట్టి ఒక్కో సీటుకీ ఐదులక్షలకి తక్కువ లేకుండా వసూలు చేస్తాం. ఎలా లేదన్నా ప్రతి ఏటా ఎనభై తొంభై లక్షలదాకా మిగులుతుంది. అలా మిగిలిన సొమ్ము ఈ పదిహేను మంది మేనేజింగ్ కమిటీ మెంబరర్లు సమానంగా పంచుకుంటారు.

## రహస్యం



తారల అందచందాల రహస్యాలు ఎవ్వరికీ అంతుచిక్కవు. కొంత మంది తారలు బాడీ బాగాలేకపోయినా ఇమేజ్‌తో ముందుకి దూసుకుపోతుంటారు. అందాలతార ఐశ్వర్యారాయ్ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తుంది. 'సినీ ఇండస్ట్రీలో అందం ప్రధానమే కానీ ఒక్కోసారి తారల ఇమేజ్ దాన్ని అధిగమిస్తుంది. నా బాడీ అంత బాగాలేకపోయినా నాకున్న పాప్యులారిటీతో నేను ముందుకెళ్ళిపోతున్నాను' అంటోంది ఐస్. వయసు పెరుగుతున్నా అందం విషయంలో ఆమె ఫాలో అయ్యే అంశాలేమిటోనని తోటితారలు వాకబు చేస్తున్నారు.




"అంత డబ్బే?" ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టింది ఆండాళ్ళు.

"వస్తుందంటావా?" అనుమానంగా అడిగాడు వరాలావు.

"ఎందుకు రాదు బావగారూ! యావరేజ్ మార్కులతో ఇంటర్ పాసైన స్టూడెంట్స్ ఎగబడి మరీవస్తారు సీట్లకోసం. అన్నట్టు అసలు విషయం చెప్పడం మరిచాను. ఈ పదిహేనుమంది కమిటీ మెంబర్లకి తలా ఒక సీటు ఫ్రీ. అలా చూస్తూ ఉండండి. అయిదారురోజుల్లో అందర్నీ కూడగట్టే బాధ్యత నాది. అప్పటికీ కాకపోతే సిటీలో నా పేరున అయిదొందల గజాల స్థలం ఉంది తెలుసుగా? ఆరేడు లక్షలు చేస్తుంది. అవసరం మనది కాబట్టి ఐదుసలక్షలకి తక్కువకాకుండా అమ్మేసి ఐదువాటాలు నేనే అట్టేపెట్టుకుంటాను. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్ళీ రాదుకదా! మళ్ళా వస్తా. చాలా పనులున్నాయి"హడావిడిగా బైటికెళ్లాడు అప్పలకొండ.

అత్తెసరు మార్కులతో పాసవుతూ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న తమ గజాలు అప్పుడే ఇంజనీర్ అయిపోయినంత సంబరపడిపోయింది ఆండాళ్ళు.

"ఆలోచిద్దాం. కాస్త ఆగవే" అని వరాలావు అంటుంటే "అబ్బ! నీకన్నీ అనుమానాలేనయ్యా. సిరి తనంతట తాను వస్తుంటే మోకాలడ్డేస్తావేంటి?" అని మొగుడ నోరు నొక్కేసి

"అందులో రెండు వాటాలు మావే తమ్ముడూ! మరింకేం మాట్లాడక" అంటూ సంబరపడుతూ డబ్బులిచ్చేసింది.

ఆరోజుల తర్వాత ఆ ప్రాంతపు ఎమ్మెల్యే గారిచేత ఆర్భాటంగా శంకుస్థాపన చేయించాడు అప్పలకొండ. జనాన్ని బాగా సమీకరించాడు. అందరికీ భోజన ఏర్పాట్లు అక్కడే. అప్పలకొండ, అతని అసిస్టెంట్ అంజి, పార్టీల చేత అగ్రిమెంట్లు మీద సంతకాలు పెట్టించడంలోను, డబ్బు కలెక్ట్ చేయడంలోనూ యమా బిజీ రోజంతా.

ఆరేడ్రోజులు గడిచాయి. అప్పలకొండ జాడలేదు.

అయినా అనుమానం రాలేదాండాళ్ళుకి. ఏదో పని బిజీలో ఉన్నాడనుకుంది. మరో పదిరోజులు గడిచినా అయిపు లేడు. అప్పుడు మొదలయింది ఆందోళన నిద్రపట్టి ఛస్తేగా..? రాత్రంతా జాగారం. తెల్లారుతూనే మొగుణ్ణి తట్టిలేపి బావురుమంది.

"తప్పుతుందా? భోగట్టా చేద్దాం" స్కూటర్ తీశాడు వరాలావు.

అప్పలకొండ మాట దేముడెరుగు. ఆ సాయంత్రం వరకూ వరాలావు జాడకూడాలేదు. ఎండలో ఎక్కడ తిరుగుతున్నాడో, ఏం పాట్లు పడుతున్నారో? మొదటిసారి మొగుడిమీద జాలేసింది. చిన్నగా భయం కూడా కలిగింది. గజాలుకి చెప్పి దగ్గర్లో ఉన్న గుడికి బయల్దేరింది.

హారతి తీసుకుంటుంటే వినిపించింది స్కూటర్ చప్పుడు.

వస్తూనే మెట్లమీద చతికిలపడ్డాడు వరాలావు.

"ఏం జరిగిందండీ?" ఆందోళనగా అడిగింది ఆండాళ్ళు.

"ఏం జరగాలో అదే జరిగింది. వద్దువద్దంటే వినకుండా తమ్ముడు తమ్ముడంటూ ఎగబడ్డావు కదూ! తగినశాస్తే జరిగింది. మీ అప్పిగాడు బ్రహ్మాండంగా అందర్నీ నమ్మించి చాలా తెలివిగా బుట్టలోవేశాడు. మొత్తం డబ్బు పట్టుకుని ఆరోజే జెండా ఎత్తేశాడు. ఆ స్థలం కూడా తనది కాదట. అక్కడికొస్తే కాళ్లిరగ్గొడతామని కర్రలు, బరిసెలు పట్టుకుని కాసుక్కూచున్నారు జనం.

ఏదైతేనేం? కనీసం నలభై లక్షలకి తక్కువ లేకుండా శఠగోపం పెట్టాడు జనాలకి.

"అమ్మో...అమ్మో! ఇప్పుడేం దారి?"కూర్చున్నచోటే కుప్పకూలిపోయింది ఆండాళ్ళు.

"అయ్యా! శఠగోపం అంటే గుర్తొచ్చింది. మీకు శఠగోపం పెట్టడం మర్చిపోయా. ఓసారిలా దయచేస్తారా?" అని ఆలయపూజారి అడుగుతుంటే ఏడవాలో నవ్వాలో తెలీక పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు వరాలావు.

★